రండి.. రండి.. రండి.. పిల్లల్లారా.. రారండి..!

'రండి.. రండి.. రండి.. పిల్లల్లారా.. రారండి..!' అంటూ.. ఉపాధ్యాయులు, అధికారులు పాఠశాలకు ఆహ్వానిస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, మెరుగైన విద్య, ఆటపాటలు.. బడిలో ఇవన్నీ ఉంటాయని ఊరిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే 'మన బడి.. అమ్మ ఒడి'లాగా ఉంటుందని నమ్మకంగా చెబుతున్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకైతే అంగన్‌వాడీ కేంద్రాల్లో చక్కటి పౌష్టికాహారం, వైద్య సేవలు, ఆటపాటలు అందుతాయని అంటున్నారు. వీధి వీధికీ, ఇంటింటికీ వెళ్లి.. ''పిల్లల్లారా.. బడికి రండర్రా..'' అని ఆహ్వానిస్తున్నారు. ''మీ పిల్లల భవిత-మా టీచర్ల బాధ్యత' అంటూ, తల్లిదండ్రులకు భరోసానిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇలా బడి బాట కార్యక్రమం దిగ్విజయం సాగుతున్నది.

భద్రాచలం: హెచ్ఎం, వారెన్లతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ములకలపల్లి: అంగన్‌వాడీ కేంద్రలో బడి బాట

భద్రాచలం, జూన్ 6: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని డిగ్రీ/జూనియర్ కళాశాలలు, ఆశ్రమ పాఠశాలలను పునఃప్రారంభం సందర్భంగా సకల సదుపాయాలతో సిద్ధం చేసినట్లు ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ చెప్పారు. పట్టణంలోని కూనవరం రోడ్డు లోగల గిరిజన సంక్షేమ డిగ్రీ-జూనియర్ కళాశాలను, బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం సందర్శించారు. అక్కడి సదుపాయాలను పరిశీలించారు. అధికారులతో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులందరికీ సరిపడినన్ని మంచాలు ఉండాలన్నారు. నాలుగు మంచాలకు ఒక్కటి చొప్పున ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అమర్చాలని చెప్పారు. గోడలు, పైకప్పులకు పగుళ్లు ఉండడాన్ని గమనించారు. వాటిని మరమ్మతు చేయించాలని ఆదేశించారు. కిటికీలకు, తలుపులకు పెయింటింగ్ వేయించాలన్నారు. గదుల్లోకి దోమలు, విషపూరిత క్రిమి కీటకాలు రాకుండా చూడాలన్నారు. ''విద్యార్థులు వచ్చే నాటికి.. కళాశాలలు/పాఠశాలలను ఇంటిని మరిపించేలా తీర్చిదిద్దాలి'' అని ఆదేశించారు. డీడీ మణెమ్మ, వార్డెన్లు పార్వతి, లక్ష్మి, హెచ్ఎం సుభద్ర, రమణ పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి మండలంలో..

అన్నపురెడ్డిపల్లి, జూన్ 6: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ఉపాధ్యాయులు బడి బాట ర్యాలీలు నిర్వహించారు. ఎంఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

టేకులపల్లి మండలంలో..

టేకులపల్లి, జూన్ 6: మండలంలోని పాతర్లగడ్డ, పాతర్లగడ్డ తండా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, సిబ్బంది బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సక్కుబాయి, టీచర్లు బేబీ, రమణ పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేట టౌన్, జూన్ 6: స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద బడి బాట ర్యాలీని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు పి హరిత ప్రారంభించారు. సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు, వీవోలు పాల్గొన్నారు.

చండ్రుగొండ మండలంలో..

చండ్రుగొండ, జూన్ 6: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వద్ద బడి బాట ర్యాలీని ఎంఈవో సత్యనారాయణ, ఎంపీడీవో అశోక్ ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు వాజీద్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం మండలంలో..

దుమ్ముగూడెం, జూన్ 6: మండలంలోని మహదేవపురం గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని దుమ్ముగూడెం ఉన్నత పాఠశాల హెచ్ఎం సవలం వసంతరావు నిర్వహించా రు. ఉపాధ్యాయులు కల్లూరి జయబాబు, పోడియం నాగేశ్వరరావు, చీమల నంగయ్య, తెల్లం చిన్నక్క, మండారి నరేశ్ పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లిలో..

లక్ష్మీదేవిపల్లి, జూన్ 6: మండలంలోని శ్రీనగర్ కాలనీ పంచాయతీ ఇందిరానగర్ కాలనీలో బడి బాట కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిరాణి నిర్వహించారు. ఉపాధ్యాయులు శౌరి. ఇన్నయ్య, ప్రత్యేక అవసరాల పిల్లల కేంద్రం భవిత ఐఆర్‌పీలు జానకి, స్వప్న, ఫిజియోథెరపిస్ట్ రూతమ్మ, అంగన్‌వాడీ టీచర్లు అంజలి, పుష్ప పాల్గొన్నారు.

ములకలపల్లి మండలంలో..

ములకలపల్లి, జూన్ 6: మండలంలోని జగన్నాథపురం-2 అంగన్‌వాడీ కేంద్రంలో బడి బాట కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ నాగమణి నిర్వహించారు. టీచర్లు సరస్వతి, సంధ్య, అరుణ, సత్యవతి, వాణి, రాజేశ్వరి, తరుపతమ్మ పాల్గొన్నారు.

ఇల్లెందు మండలంలో..

ఇల్లెందు రూరల్, జూన్ 6: మండలంలోని చల్లసముద్రం, కొమరారం, గోవింద్ సెంటర్ గ్రామాల్లో బడి బాట ర్యాలీని ఉపాధ్యాయులు నిర్వహించారు. ఎంఈవో పిల్లి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

బూర్గంపాడు మండలంలో..

బూర్గంపాడు, జూన్ 6: మండలంలోని సోంపల్లి గ్రామంలో బడి బాట ర్యాలీని గ్రామ పెద్ద పండుగ రాములు ప్రారంభించారు. హెచ్ఎం మోహన్, అమ్మ అదర్శ కమిటీ చైర్మన్ తోకల అనిత, ఉపాధ్యాయులు సైదులు, రవి, తిరుపతమ్మ పాల్గొన్నారు.

జూలూరుపాడు మండలంలో..

జూలూరుపాడు, జూన్ 6: జూలూరుపాడులో బడి బాట ర్యాలీని స్థానిక జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించారు.

మణుగూరు టౌన్..

మణుగూరు టౌన్, జూన్ 6: ఐసీడీఎస్ మణుగూరు ప్రాజెక్ట్ పరిధిలోని మణుగూరు- 1, 2,3 శివాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గురువారం సూపర్‌వైజర్ సుశీల ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు మల్లీశ్వరి, సుజాత, భద్రమ్మ, కస్తూరి గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లెందు రూరల్: కొమరారంలో ర్యాలీ

అశ్వారావుపేట టౌన్: బడిబాట ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మణుగూరు టౌన్: బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం, జూలూరుపాడు: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, బూర్గంపాడు: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, లక్ష్మీదేవిపల్లి: బడి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నీట్‌లో గిరిజన విద్యార్థినికి ఉత్తమ ర్యాంక్

పోలెబోయిన రిషిత

కరకగూడెం, జూన్ 6: రెండు రోజుల క్రితం వెలువడిన ఆల్ ఇండియా నీట్ ఫలితాల్లో గిరిజన విద్యార్థిని ర్యాంక్ సాధించింది. మండలంలోని తాటిగూడెం గ్రామానికి చెందిన పోలీబోయిన గంగరాజు- ధనలక్ష్మీ దంపతుల కుమార్తె పోలెబోయిన రిషిత నీట్-2024 ప్రవేశ పరీక్షలో మొత్తం 720 మార్కులకు 596 మార్కులు సాధించి ఆల్ ఇండియా ఎస్టీ కోటాలో 573 ర్యాంకు అలాగే జనరల్ కోటాలో 85,146 సాధించింది. నీట్‌లో మంచి ర్యాంకు సాధించిన రిషితను తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, తోటి మిత్రులు అభినందనలు తెలిపారు.

'నీట్' ర్యాంకర్‌కు సన్మానం

విద్యార్థిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

పాల్వంచ రూరల్, జూన్ 6: మండలంలోని లక్ష్మీదేవిపల్లి సోషల్ వెల్ఫేర్ స్కూల్, కాలేజీలో చదివిన గోపి శ్యాంసన్... నీట్‌లో 544 మార్కులు సాధించాడు. ఈయన ప్రతిభను ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు గుర్తించి, లాంగ్ టర్మ్ కోచింగ్ ఇప్పించారు. మంచి మార్కులు సాధించిన శ్యాంసన్‌ను కళాశాలలో ప్రిన్సిపాల్ గురువారం సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణ, అధ్యాపకులు నరేష్‌బాబు, ప్రవీణ్, మోహన్ రాయ్, దస్తగిరి పాల్గొన్నారు.

ఘనంగా ప్రత్యంగిరా దేవి హోమం

హోమం నిర్వహిస్తున్న భక్తులు

మణుగూరు టౌన్, జూన్ 6: మండలంలోని ఐలమ్మ నగర్‌లో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయంలో గురువారం పంచగ్రహ కూటమి, శనీశ్వర జయంతి, అమావాస్య సందర్భంగా లోక కల్యాణార్థం ఆలయంలో ప్రత్యంగిరా దేవి హోమం నిర్వహించారు. బ్రహ్మశ్రీ తుమోజు శ్రీనివాసచార్యులు చేత ప్రధాన అర్చకులు యోగేంద్ర ఆచార్యులు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా హోమంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సీతారామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, జూన్ 6: భద్రాద్రి సీతారామచంద్ర స్వామికి అర్చకులు గురువారం బేడా మండపంలో నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

ఓసీ-2 రైల్వే అండర్ బ్రిడ్జి నీరు మళ్లించాలి

ఇన్‌చార్జి జీఎం లక్ష్మీపతిగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇఫ్టూ నేతలు

మణుగూరు టౌన్, జూన్ 6: ఓసీ-2 నూతన కార్యాలయం, కేపీయూజీ ప్రధాన రహదారి రైల్వే అండర్ బ్రిడ్జి వరద నీటిని మళ్లించాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో గురువారం ఏరియా ఇన్‌చార్జి జీఎం లక్ష్మీపతిగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నాసర్‌పాషా మాట్లాడుతూ.. ఓసీ-2 సైట్ ఆఫీస్, కొండాపురం భూగర్భ గని, దుర్గా-2 ఓబీ కంపెనీకి వెళ్లే ప్రధాన రహదారికి సంబంధించిన మార్గమధ్యలో రైల్వే అండర్‌బ్రిడ్జి నుంచి ప్రయాణిస్తున్నామని, వర్షం పడితే రైల్వే అండర్ బ్రిడ్జిలో పెద్దఎత్తున నీరు నిలుస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు చొరవ చూపి రైల్వే గేట్ నుంచి కొత్త దారి ఏర్పాటు చేయడం వంటి అంశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

మాట్లాడుతున్న మల్లారపు మల్లయ్య

టేకులపల్లి, జూన్ 6: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని ఎస్‌వోటు జీఎం మల్లారపు మల్లయ్య అన్నారు. సింగరేణి కోయగూడెం ఉపరితల గనిలో ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణపై ఉద్యోగులంతా దృష్టి పెట్టాలన్నారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గని ప్రమాదాలపై అవగాహన

ఇల్లెందు రూరల్, జూన్ 6: గని ప్రమాదాలు-నివారణపై సింగరేణి ఇల్లెందు ఏరియా ఉద్యోగులకు జీఎం జాన్ ఆనంద్ గురువారం అవగాహన కల్పించారు. జేకే ఉపరితల గనిలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, మేనేజర్ పూర్ణచందర్, అధికారులు శివప్రసాద్, చిన్నయ్య, సుధాకర్, కార్మిక నాయకులు సంజీవచారి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'పచ్చిరొట్ట ఎరువులకు కొరత లేదు'

మాట్లాడుతున్న ఏడీవో అబ్జల్‌బేగం

చండ్రుగొండ, జూన్ 6: పచ్చిరొట్ట ఎరువులకు కొరత లేదని, సకాలంలో అందిస్తామని అశ్వారావుపేట వ్యవసాయ శాఖ ఏడీవో అబ్జల్‌బేగం స్పష్టం చేశారు. స్థానిక రైతు వేదికలో గురువారం రైతులతో సమావేశమయ్యారు. 334 బస్తాల విత్తనాలలో మొలక శాతం తగ్గినందున వాటిని తిరస్కరించినట్లు చెప్పారు. మండల వ్యవసాయ శాఖ అధికారి వినయ్, గుంపెన, గానుగపాడు సహకార సంఘాల కార్యదర్శులు వెంకటేశ్వర్లు, నరసింహారావు పాల్గొన్నారు.

చంద్రరాజేశ్వరరావుకు నివాళి

నివాళి అర్పిస్తున్న సాబీర్‌పాషా

కొత్తగూడెం అర్బన్, జూన్ 6: సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతి సభ గురువారం స్థానిక శేషగిరి భవన్‌లో గురువారం జరిగిది. చిత్రపటానికి జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు రేసు ఎల్లయ్య, దమ్మాల పాటి శేషయ్య, బత్తుల సురేష్, జహీర్, గుత్తుల శ్రీను, ఇర్ఫాన్, యాకూబ్, పున్నం సింగ్, సోమయ్య, లక్ష్మి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రాజసాయి మందిరంలో అన్నదానం

పెనుబల్లి, జూన్ 6: మండలంలోని వీఎం బంజరలో ఉన్న శ్రీరాజసాయి మందిరంలో దాతలు అందజేసిన విరాళాలతో గురువారం అన్నదానం నిర్వహించారు. ప్రతి గురువారం అన్నదానం చేయదల్చిన వారు తొలుత ఆలయ కమిటీకు తెలపాలని చైర్మన్ జన్నారెడ్డి విజయ తెలిపారు.

నిత్యావసర సరుకుల సరఫరా టెండర్లకు ఆహ్వానం

భద్రాచలం, జూన్ 6: జిల్లా గిరిజన సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న పాఠశాలలు, వసతి గృహాలకు కోడిగుడ్లు, కూరగాయలు, అరటిపండ్లు, స్కిన్‌లెస్ చికెన్, టెట్రా పాలు సరఫరా చేసేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 'డీడీ, గిరిజన సంక్షేమ శాఖ, భద్రాచలం' పేరున ఎస్‌బీఐలో డీడీ తీసి, టెండర్ ఫారానికి జత పచేయాలని పేర్కొన్నారు. దరఖాస్తు రూ.2వేలు ఉంటుందని పేర్కొన్నారు. కూరగాయలకు రూ..40వేలు, పండ్లకు రూ. 25వేలు, కోడిగుడ్లుకు రూ.45వేలు, స్కిన్‌లెస్ చికెన్‌కు రూ.40వేలు, టెట్రా పాలకు రూ.40వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని వివరించారు ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు టెండర్ ఫారాలను గిరిజన సంక్షేమ శాఖ డీడీ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సరఫరాదారులకు ధరావత్తు డిపాజిట్‌లో 40 శాతం రాయితీ ఉందని పేర్కొన్నారు. ఈ నెల 18న సాయంత్రం 5.00 గంటల వరకు టెండర్లు దాఖలు చేయవచ్చని తెలిపారు. 19న ఉదయం 11.00 గంటలకు సీల్డ్ టెండర్లు తెరవనున్నట్లు తెలిపారు.

13న స్కార్పియో వాహనం వేలం

భద్రాచలం, జూన్ 6: ఐటీడీఏలో గతంలో పీవో వినియోగించిన స్కార్పియో వాహనం అమ్మకానికి ఈ నెల 13న వేలం పాట నిర్వహించనున్నట్లు పీవో ప్రతీక్ జైన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2009 మోడల్‌కు చెందిన ఏపీ 20 ఏఏ0369 నంబర్ గల ఈ డీజిల్ వాహనం వేలం పాటలో పాల్గొనదలిచిన వారు ముందుగా ధరావత్ సొమ్ము రూ. 21,500ను డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో 'పీవో, భద్రాచలం ఐటీడీఏ' పేరున తీసుకుని, టెండర్ ఫారానికి జత చేసి ఈ నెల 13న మధ్యాహ్నం ఒంటి గంట లోపు పీవో కార్యాలయంలో ఇవ్వాలని వివరించారు. అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. టెండర్ ఫారాన్ని రూ. 1,000 చెల్లించి ఐటీడీఏ కార్యాలయంలో పొందవచ్చని పేర్కొన్నారు. వాహనాన్ని ఐటీడీఏ ప్రాంగణంలో తనిఖీ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 63027 48692, 96526 95324 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

రాజకీయ తరగతులు ప్రారంభం

టేకులపల్లి, జూన్ 6: సీపీఐ-ఎంఎల్ న్యూడెమోక్రసీ రాజకీయ తరగతులను ఆ పార్టీ నాయకుడు ఆవునూరి మధు గురువారం టేకులపల్లిలో ప్రారంభించారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు, నాయకులు గొని నాగేశ్వరరావు, ఉమర్, కల్తీ వెంకటేశ్వర్లు, కోరం సీతారాములు, కుంజ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో కరుణామయి

ములకలపల్లి, జూన్ 6: మండలంలోని విత్తన దుకణాలను మండల వ్యవసాయ శాఖాధికారి కరుణామయి గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. టాస్క్ ఫోర్స్ ఎస్సై రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

లక్ష్మీదేవిపల్లి, జూన్ 6: సొసైటీల్లో పచ్చిరొట్ట విత్తనాలు, అధీకృత డీలర్ల వద్ద పత్తి, వరి విత్తనాలు రైతుల అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సరిపడిననని జీలుగు విత్తనాలను సబ్సిడీపై విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

'ఆశా'లకు పరీక్ష పెట్టొద్దని వినతి

దమ్మపేట: వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చండ్రుగొండ: డాక్టర్ తనూజకు వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

దమ్మపేట, జూన్ 6: ఏళ్లతరబడి విధులు నిర్వహిస్తున్న ఆశాలకు తిరిగి పరీక్ష పెట్టాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆశా వర్కర్ల సంఘం(సీఐటీయూ) నాయకులు గురువారం దమ్మపేట, పట్వారిగూడెం వైద్యాధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. తమ నెలసరి వేతనాన్ని రూ.18వేలుగా నిర్ణయించాలని కోరారు. రాళ్లు సునీత, శారద, శ్రీలత, రజని, రమణ, పద్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండలో..

చండ్రుగొండ, జూన్ 6: తమకు పరీక్ష పెట్టవద్దని కోరుతూ ఆశా వర్కర్ల సంఘం నాయకులు గురువారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కనకం తనూజకు వినతిపత్రం ఇచ్చారు. రుక్మిణి, రమాదేవి, రాజేశ్వరి, లక్ష్మి, అరుణ, పుణ్యవతి పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌కు 'మెచ్చా' దరఖాస్తు

అశ్వారావుపేట, జూన్ 6: మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణకు స్థానిక ఆర్టీవో సబ్ యూనిట్ కార్యాలయంలో ఎంవీఐ ఎంవీఐ వెంకటరమణకు దరఖాస్తు ఇచ్చారు. ''మీ కృషితోనే ఈ కార్యాలయం ఏర్పాటైంది'' అని ఆయనతో అక్కడి అధికారులు, దరఖాస్తుదారులు చెప్పారు.

ఈ నెల 9 నుంచి ఇఫ్టూ ఏరియా మహాసభలు

కొత్తగూడెం అర్బన్, జూన్ 6: జిల్లాలోని ఇల్లెందు, టేకులపల్లి, గుండాల, కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు ఏరియాల్లో జరిగే ఇఫ్టూ మహాసభలను కార్మికులు విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.మధుసూదన్‌రెడ్డి, యాకూబ్ షావలి కోరారు. ఆర్.మధుసూధన్ రెడ్డి అధ్యక్షతన కొత్తగూడెం కార్యాలయంలో గురువారం జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కార్మిక సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ప్రదర్శిస్తూ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ నెల 9న ఇల్లెందు, 10న కొత్తగూడెం, 11న టేకులపల్లి, 13న గుండాల, 15న పాల్వంచ, 16న మణుగూరు, భద్రాచలం ఏరియా మహాసభలు ఉంటాయని చెప్పారు. సమావేశంలో నాయకులు గోనెల రమేష్, వై.గోపాలరావు, పాయం వెంకన్న, చంద్రశేఖర్, మల్సూర్, మల్లెల వెంకటేశ్వర్లు, సుందర్, శాంతయ్య, రాజశేకర్, వేల్పుల రమేష్ పాల్గొన్నారు.

అద్దె వాహనదారులతో సింగరేణి యాజమాన్యం చర్చలు

మాట్లాడుతున్న సింగరేణి అధికారులు

కొత్తగూడెం సింగరేణి, జూన్ 6: సింగరేణివ్యాప్తంగా భూ నిర్వాసిత అద్దె వాహన యజమానులు, డ్రైవర్ల మెమొరాండంలోని డిమాండ్లపై వారితో సింగరేణి యాజమాన్యం ప్రధాన కార్యాలయమైన హెచ్ఆర్‌డీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం సుదీర్ఘంగా చర్చించింది. జనరల్ మేనేజర్లు, అధికారులు జగన్‌మోహన్‌రావు, బీఆర్ దీక్షితులు, సురేష్‌బాబు, వెంకయ్య, బి.రవి, అజయ్‌కుమార్, వరప్రసాద్, రాజేశ్వరరావు, రామశేషయ్య, తిరుపతి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రెండు దుక్కిటెద్దులు మృతి

సంఘటన స్థలం వద్ద మృతిచెందిన ఎడ్లు

టేకులపల్లి, జూన్ 6: పిడుగుపాటుకు రెండు దుక్కిటెద్దులు మృతిచెందాయి. మండలంలోని రామచంద్రునిపేట గ్రామ రైతు పూన్నెం సుధాకర్, తన దుక్కిటెద్దులను ఇంటి సమీపంలోని చెట్టు కింద బుధవారం రాత్రి కట్టేశాడు. గురువారం తెల్లవారు జామున ఉరుములు మెరుపులో కూడిన వర్షం కురిసింది. ఈ చెట్టుపై పిడుగు పడడంతో రెండు దుక్కిటెద్దులు మృతి చెందాయి. వీటి విలువ రూ.లక్ష ఉంటుందని బాధితులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు..

సులానగర్ గ్రామ సమీపంలో తక్కువ ఎత్తులో గల ట్రాన్స్‌ఫార్మర్ తగలడంతో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. దీని విలువ రూ.50వేలు ఉంటుందని బాధిత రైతు అజ్మీర రాము తెలిపాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్

గుండాల, జూన్ 6: మండలంలోని ముత్తాపురం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను గురువారం తహసీల్దార్ ఇమ్మానుయేల్ సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. అక్రమంగా ఇసుక రవాణా చేసి చేశారన్న విషయాన్ని రెవెన్యూ శాఖకు తెలిసిన వెంటనే తహసీల్దార్, గిర్దావర్-2 ఆధ్వర్యంలో వెళ్ళి పంచనామ నిర్వహించి సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను గిర్దావార్ -2 గుండాల తెల్లం జోగయ్య పర్యవేక్షణలో ఉన్నదని వారు పేర్కొన్నారు.

గుండెపోటుతో బీటీపీఎస్ ఉద్యోగిణి మృతి

పాల్వంచ, జూన్ 6: బీటీపీఎస్ ఉద్యోగిణి, స్థానిక గట్టాయిగూడేనికి చెందిన చాట్ల రాధ(40) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఈమె గట్టాయిగూడెంలో ఉంటూ రోజూ మణుగూరులోని బీటీపీఎస్ విధులకు వెళ్లి వస్తున్నారు. రెండు రోజుల నుంచి అస్వస్థులుగా ఉంటున్నారు. గురువారం ఆస్పత్రికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అంతలోనే ఇంట్లో కుప్పకూలి పడిపోయారు. కుటుంబీకులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గుండెపోటుతో అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమె తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

తలసేమియా వ్యాధితో బాలిక మృతి

పర్ణశాల, జూన్ 6: దుమ్ముగూడెం మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన గిరిజన బాలిక సోడి సీతా మాలక్ష్మి (16) తలసేమియా వ్యాధితో గురువారం మృతి చెందింది. ఆమెకు ఏడాది క్రితం ఈ వ్యాధి సోకింది. నెల క్రితం జ్వరం రావడంతో తల్లిదండ్రులు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి అక్కడే చికిత్స పొందుతున్న ఆమె గురువారం మృతిచెందింది. ఈమె ఈ ఏడాది గౌరారం బాలికల ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి పూర్తి చేసింది.